# కవితా కౌముది

## మూడో అంకం

శ్రీనివాసరావు బారు

తెల్ల చొక్కా
నల్ల బూటు
అమ్మ ముద్దులు, నాన్న సుద్దులు - స్కూల్లో తొలిరోజు
తెలియని వ్యక్తుల మధ్య తహతహలాడినా
బాల్యం తిరిగొస్తే ఎంతో ఘనమనిపిస్తుంది
దశాబ్దాల తరువాత ఆదే స్వర్గ మనిపిస్తుంది!

వంద నోటు
క్రొత్త సూటు
ఉత్సాహం, ఉద్వేగం - ఉద్యోగం తొలిరోజు
తెలిసీ తెలియని వ్యక్తుల మధ్య ఉత్కంఠ కలిగినా
మూడు పురుషార్థాల స్పర్శ ఏ మూలో తగులుతుంది
దశాబ్దాల కాలం రోజుల్లా దొర్లుతుంది!





వారాంతం తీరిక
వారం కూడా తీరికే
సందేహం, సంశయం - పదవి విరమణ తొలిరోజు
తెలిసిన వ్యక్తుల మధ్య విశ్రాంతి శ్రమయినా
నిష్క్రియాపర్వం కూడా అనివార్యమవుతుంది
పాత్రకు, నటుడికి మధ్య దూరం  అవసరమవుతుంది!!

★★★

## చెమట పట్టిన అక్షరాలు
## నాగ్రాజ్

ఎన్నాళ్ళుగానో ఒక కోరిక
అందమైన ప్రణయగీతం రాయాలి
కలం పట్టుకుని కాల్పనిక
వీధుల్లో తిరగడం మొదలుపెట్టాను
నేను ఊహించిన లోకం కాదిది
ఎక్కడున్నానో తెలియడంలేదు
అంతా బురద,ముళ్లపొదలు
బొట్లు బొట్లుగా కారుతున్నరక్తపుచుక్కలు
అదిరిపడి వెనుతిరిగాను
ఆగమంటూ ఎవరో వెంబడిస్తున్నారు
ఏదోభయం నాలో
పాదాలు వేగంపుంజుకున్నాయి
ఒక్కసారిగా అక్షరాలు
కుండపోతగా నాముందు
వర్షమై ప్రవహిస్తున్నాయి
చెమట వాసన
కన్నీటిధార
ఆర్తి పిలుపు
ఇదంతా నేను రోజు
చూసే ప్రపంచమే
ఈ రోజు కొత్తగా
చెమటగంధం పూసింది
అక్షరాల చేయిపట్టుకున్న
మట్టిమనుషుల గీతం రాస్తున్న
అభూతకల్పనల చెరనుండి బయటపడి!

★★★

## నాదే లోకం?
## బాలాజీ పోతుల

ఉన్నపళంగా నే నదృశ్యమైపోవాలి
నా ఆనవాళ్లే లేని ఇంకో లోకానికి
నే చేరిపోవాలి!
ఇక్కడంతా ఒకటే రొద
నా చెవులు తాళలేకున్నాయి
రక్తాలు కక్కి చచ్చేలాగున్నాయి!
ఇంకా
ఇక్కడంతా ఒకటే వాసన
నా ముక్కు ఊపిరి తీసుకుంటలేదు
లోపలంతా ఊపిరి నిండిపోయింది
నా ఊపిరి ఆగిపోయింది..
నేనిప్పుడు ఎక్కడికెళ్తానో చూడాలి
నా కళ్ళు మూతలు పడుతున్నాయి
ఎవ్వరో నన్ను పట్టుకొని లేపుతున్నారు
నా పై ఎందుకో పేలాలు చల్లుతున్నారు
అదిగో అక్కడే నా ఇల్లనుకుంటా
ఆరడుగులే ఉందేంటి?
ఇప్పుడు అందరూ నాపై మన్నుకి బదులు
మంటని చల్లుతున్నారేంటి?
నేనిప్పుడు కాలిపోవాలా?
అవునూ,
నేనిప్పుడు ఎక్కడికొచ్చాను?
నాదేలోకం?

★★★

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

యామవతివేళ చీకటులలమినపుడు
అమృతకిరణుండు విశ్రాంతికలిగినపుడు
అంబుదములన్ని కనుమరుగైన యపుడు
స్పష్టముగనుడువీధి కన్పడిన యపుడు

వెడలి యారుబైటకు వినువీధినరయ
చెలగు తారలగాంచి నా చిత్తమలరె
అమరి నక్షత్రతతులెన్నొ యంబరమున
నవవికస్వరదివ్యసౌందర్యమలదె

పొడము కృత్తికాదులు ననబోడులట్లు
మెరయు దంపతులిర్వురు మిథునరాశి
వేల నక్షత్రముల్ కనువిందు చేయు
అంతనంతలో గ్రహములనరయనగును

ఎచటనేమూలనుంటిమీ యనంత
సృష్టియందెంత యల్పమో పృథివి మనది
అంతరిక్షమునుండిలనరసినంత
స్పష్టమౌ విశ్వమున మన స్థాయి యెంతొ

అఖిలవిశ్వాన మన భూమి యల్పమైన
చిన్నదైనను మానవజీవితమ్ము
సృష్టినెల్లను దర్శించు దృష్టి మనది
సార్థకమ్మైన యద్భుతజన్మ మనది

COMMENTS